క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ రామాంజులు



కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి. రామాంజులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేస్తున్న నారాయణరెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ కాగా ఆ స్థానంలో కర్నూలు స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేస్తున్న రామాంజులు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. శాంతిభద్రలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదన్నారు. సీఐని సర్కిల్ ఎస్‌ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, రమేష్ రెడ్డి, ప్రతాప్, కల్పన తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

ఈఓఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరి



కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా శ్రీహరి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈఓఆర్డీగా విధులు నిర్వహించిన తాహీర్ హుసేన్ ఆళ్లగడ్డకు బదిలీపై వెళ్లారు. మద్దికెరలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీహరి పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జెడ్పీ విద్యార్థి సాధక్



బనగానపల్లెరూరల్ : మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎ సాధక్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. కర్నూలులోని బి.క్యాంప్ స్కూల్‌లో జరిగిన అండర్-17 జిల్లా స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో సాధక్ ఎంపికయ్యాడని హెచ్‌ఎం బయన్న తెలిపారు. ఈ నెల 29 నుంచి గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థా యి హ్యాడ్‌బాల్ పోటీల్లో సాధక్ పాల్గొంటారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన మంటి లక్ష్మీదేవి అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితిని కాలనీ వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్, మురళీ, బాలశేఖర్, సుందరరాజు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ. 10 వేల అందజేయగా నాయకులు బాధిత కుటుంబానికి ఇచ్చారు.

ఉపాధి పనుల లక్ష్యాన్ని అధిగమించాలి

కోవెలకుంట్ల: 2023-24 ఆర్థిక సంవత్సరంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం కింద నిర్దేశించిన పనుల లక్ష్యాన్ని అధిగమించా లని ఏపీఓ శ్రీవిద్య సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉద్యానవన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పి ంచాలన్నారు.మామిడి, చీని, సపోట, నిమ్మ, దానిమ్మ తదితర 25 రకాల పండ్ల, పూల తోటలు, కూరగాయల సాగుకు సన్న, చిన్నకారు రైతులకు వందశాతం సబ్సిడీ వర్తింపజేస్తున్నామని, రైతు లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బనగానపల్లెరూరల్ : మండలంలోని దద్దణాల ప్రాజెక్టు మద్దిలేటిస్వామి రహదారి సమీపంలో మోటార్ సైకిల్‌ను, ఆటో ఢీ కొట్టిన సంఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయని ఎస్‌ఐ వీరాంజనేయులు బుధవారం తెలిపారు. పట్టణంలోని తెలుగుపేటకు చెందిన సావిత్రి ఆమె తమ్ముడు జక్కు శ్రీనివాసులు మరో యువకుడు విష్ణు మోటార్ సైకిల్‌పై పసుపల గ్రామ వైపు నుంచి బనగానపల్లెకు వస్తున్నారు. అదేవిధంగా బనగానపల్లె వైపు నుంచి పసుపల వైపు అతివేగంగా వస్తున్న ఆటో, మద్దిలేటిస్వామికి వెళ్లు దారి సమీపంలో మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు గాయాల పాలయ్యారు. స్థానికుల బాధితులను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శ్రీనివాసులు, సావిత్రిలకు తీవ్ర గాయాలు కాగా విష్ణుకు స్వల్పగాయాలయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



బనగానపల్లె: వైద్యాధికారి శివశంకరుడు సమక్షంలో మహిళకు రక్త పరీక్ష చేస్తున్న సిబ్బంది



కోవెలకుంట్ల: కలుగొట్లలో కృష్ణవేణికి రక్త పరీక్ష చేస్తున్న ఏఎన్‌ఎం.



సంజామల: రెడ్డిపల్లెలో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది



కోవెలకుంట్ల: వృద్ధుడు వెంకటసుబ్బయ్యకు బీపీ పరీక్ష చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ మమత

బనగానపల్లె : ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు 15వ తేదీ నుంచి ప్రారంభమైన రోగులు గుర్తించే సర్వే చురుగ్గా సాగుతుంది. బనగానపల్లె నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 35 వేల మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు వైద్య సిబ్బంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల పర్యవేక్షణలో ఆశా వర్కర్లు ఏఎన్‌ఎంలు ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. బీపీ షుగర్, యూరిన్, గల్ల మలేరియా, డెంగీ తదితర వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆయా వ్యక్తుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ నెల 30 నుంచి అక్టోబర్ 30 వరకు నిర్వహించే ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లో పాల్గొనాల్సిన వ్యక్తులకు ఇళ్ల వద్దనే టోకన్ పంపిణీ చేస్తున్నారు. మెడికల్ క్యాంప్ ద్వారా నయకాని జబ్బులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సౌకర్యం కల్పించడం జరుగుతుందని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివశంకరుడు పేర్కొన్నారు.

డోన్ అభివృద్ధే మంత్రి బుగ్గన లక్ష్యం

- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి
- ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు... 200 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దాదాపు రూ. 2,400 కోట్లతో డోన్ నియోజకర్గంలో అభివృద్ధి పనులు చేయించారని గుర్తు చేశారు. మంత్రి బుగ్గన జన్మదిన వేడుకలు బుధవారం డోన్ నియోజకర్గంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక సాయి శ్రీ ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దినేష్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 200 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన 200 మంది పార్టీ కార్యకర్తలకు, నాయకులతో పాటు ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డికి డీఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ మంత్రి బుగ్గన తమకు అందుబాటులో ఉండకుండా అధికారులతోనే తరచుగా సమావేశాలు నిర్వహిస్తున్నారని కార్యకర్తలు అపోహ పడుతుంటారని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులపైనే దృష్టి సారిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మోడల్ నియోజకర్గంగా డోన్‌ను తీర్చిదిద్దుతున్నారని గుర్తు చేశారు. నాలుగేళ్లలో రెండేళ్లు కరోనా మింగేయగా మిగిలిన రెండేళ్లలో రూ. 2,400 కోట్ల అభివృద్ధి పనులు చేయించారంటే అధికారులపై ఎంత ఒత్తిడి చేసింటారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

అన్నిరంగాలలో అభివృద్ధి

డోన్ నియోజకవర్గం విద్య, వైద్య, పారిశ్రామిక, ఉపాధి, టూరిజం, సాగునీటి, తాగునీటి రంగాలలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిందంటే ఆర్థిక మంత్రి బుగ్గన కృషిని ప్రజలు అభినందించక తప్పదని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట కోసం మంత్రి రూ. 2,400 కోట్లతో అభివృద్ధి పనులను చేయించారన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వాదించాలని కోరారు.

అన్నదానం

రక్తదాన శిబిరం నిర్వాహకులు దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని పాతబస్టాండ్, అమ్మ హోటల్ వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు పాతపేట రఫి, కుమ్మరి రాజు, కౌన్సిలర్లు విమల, వెంకట్రాముడు, మహేశ్వరరెడ్డి, రైల్వే నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, మున్సిపల్ వైఎస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, నాయకులు ఓబులాపురం మదన్, సుధాకర్, మహేంద్ర, ఆర్‌ఈ రాజవర్ధన్, మంత్రి పీఏలు రమేష్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సేవకు పరితపించే నాయకుడు బుగ్గన

బేతంచెర్ల: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, మద్దిలేటి స్వామి చైర్మన్ రామ చంద్రుడు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

ప్యాపిలి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం మంత్రి బుగ్గన జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకేటశ్వర్‌రెడ్డి, డోన్ మార్కెట్‌యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి ఆధ్వర్యలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ

- అభివృద్ధిపై పాతబస్టాండ్‌లో డాక్యుమెంటరీ ప్రదర్శన



డోన్ అభివృద్ధిపై పాతబస్టాండ్‌లో డాక్యుమెంటరీని ప్రదర్శిస్తున్న దృశ్యం

డోన్ : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదినం వేడుకలు బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు, కర్యాకర్తలు రాత్రి మంత్రి స్వగృహం వద్ద కేక్ కట్ చేసి, బాన సంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జెడ్పీటీసీ రాజ్‌కుమార్ యాదవ్, దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి స్వగృహం నుంచి పాతబస్టాండ్ వరకు కేంద్రీయ విద్యాలయం మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధిపై ప్రోమో....

డోన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గాన్ని మంత్రి తీర్చిదిద్దడంపై రూపొందించిన డాక్యుమెంటరీని పాతబస్టాండ్ కట్టపై ప్రదర్శించారు. డోన్ మోడల్ నియోజకవర్గంగా సీఎం సహకారంతో మంత్రి బుగ్గన ఎలా తీర్చిద్దారనే దానిపై మీ ఓటు విలువ రూ.2400కోట్లు అనే శీర్షికన నిర్మించిన డాక్యుమెంటరీ పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా కార్యకర్తలు పేల్చిన బాన సంచాలతో పట్టణం దద్దరిల్లింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, పట్టణ అధ్యక్షుడు కురుకుందు హరి, మహిళా కౌన్సిలర్‌లు మిట్టా ఉమామహేశ్వరి, బద్దల సుబ్బలక్ష్మి, బోయ కళావతి, వెంకటేశ్వరమ్మ, పాలుట్ల మీనాక్షి , బోయ విమల తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

అవుకు: మండలంలోని కునుకుంట్ల గ్రామ సచివాలయాన్ని బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. మూమెంట్, అటెండెన్స్ తదితర రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి రోజు తప్పకుండా సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఘనంగా ప్రపంచ పర్యటక దినోత్సవం

బనగానపల్లెరూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతాదేవి ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ పర్యటక దినోత్సవం ఘనంగా జరిగింది. చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ బడేసాహెబ్ ఐక్యరాజ్య సమితి ఈ సంవత్సరాన్ని పర్యాటక, గ్రీన్ ఇన్వెస్టిమెంట్‌గా ప్రకటించడం జరిగిందన్నా రు. పర్యాటకశాఖ అభివృద్ధితో ఇతర ప్రాంత ప్రజ ల సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునే అవకా శం కలుగుతుందన్నారు. తెలుగు అధ్యాపకుడు డాక్ట ర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె ప్రాంతంలో బ్రహ్మంగారి మఠం, నవాబులకోట, యాగంటి, నందవరం, రవ్వలకొండ, బెలుంగుహా లు మంగంపేటజలపాతం తదితర పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, ఇంకా మెరుగైన రవాణా సౌకర్యాలు సమకూర్చాల్సిన అవసరం ఉందన్నారు.

చిన్నారులకు రక్త దానం

డోన్ టౌన్ : పట్టణానికి చెందిన ద్రోణాచలం సేవా సమితి సభ్యులు తిరుపాల్ తన బి.పాజిటివ్ రక్తాన్ని బుధవారం 18వ సారి దానం చేశారు. నంద్యాలకు చెందిన ఇద్దరు తలసేమియా చిన్నారులకు రక్తం అవసరం కావడంతో తిరుపాల్‌తో పాటు ఆతని స్నేహితుడు సాయి ఓ పాజిటివ్ రక్తాన్ని ఇచ్చారు. వీరికి బాధిత చిన్నారుల తల్లిదండ్రులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలి

డోన్ టౌన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ వేడుకలను జయప్రదం చేయాలని ఆ శాఖ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట సుబ్బారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. బుధవారం వారు డోన్ పట్టణంలోని పాతపేట ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రోచర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వ సంవత్సరంలో అడుగు పెట్టిన సందర్భంగా విజయవాడలో అక్టోబర్ 1 వ తేదీ నిర్వహించే ప్రారంభోత్సవ వేడుకలకు యూటీఎఫ్ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవిశేఖరన్, సుభాన్, భూకాంత రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ముస్లింల ర్యాలీ



ప్రార్థన గీతాలను ఆలపిస్తున్న ముస్లిం సోదరులు

బేతంచెర్ల: మిలాద్-ఉన్-నబీ పండుగను పురస్కరించుకొని పట్టణంలో బుధవారం ముస్లిం సోదరులు జెండాలు పట్టుకొని పురవీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. మండల ఖాజీ నూర్ అహ్మద్ ఆధ్వర్యంలో స్థానిక జెండా పేట మసీదు నుంచి మైయిన్ బజార్, ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ సాగింది. ప్రపంచ శాంతి కోసం అందరూ అల్లాహ్ కరుణతో సుఖ సంతోషాలతో వర్ధిలాలని ప్రార్థన గీతలు ఆలపించారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు ఖాజా హుసేన్, దస్తగిరి, ఖాజా, సలీమ్, అబ్దుల్ ఖాదర్, మగ్బుల్, రహంతుల్లా, అక్తాబ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



మధుశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్ : బనగానపల్లె పట్టణంలోని కొండపేటకు చెందిన వార్డు వలంటీర్ గట్టు మధుశేఖర్ (24) ఈ నెల 24వ తేదీన ఎస్సార్‌బీసీ కాల్వలో గల్లంతై మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గట్టు మధుశేఖర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మీకు ఎలాంటి సహాయంకావాలన్నా తప్పక అందిస్తామని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాలనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

రక్తదానం

డోన్ టౌన్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల సందర్భంగా బుధవారం బీజేపీ నాయకులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షురాలు బైరెడ్డి శబరి, డోన్ పట్టణ అధ్యక్షుడు సందు వెంకటరమణ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకరాంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సాయిశ్రీ, వైష్ణవి డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవికుమార్, ఒంటెద్దుబండి కిరణ్, బద్రి సుధాకర్, పవన్ కుమార్, నాగరాజు, భాస్కర్, రమణయ్య, బేతంచెర్ల బీజేపీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణ చారిత్రాత్మక నిర్ణయం

కోవెలకుంట్ల: 23 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల్లో రెండు దశాబ్దాలకు పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయడం శుభ పరిణామమన్నారు. క్రమబద్ధీకరణ ముసాయిదా బిల్లును శాసనసభ, శాసన మండలిలో ప్రవేశ పెట్టి గొప్ప మార్పునకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులమంతా జీవితాంతం సీఎంకు రుణపడి ఉంటామని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

40 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు

కోవెలకుంట్ల: అక్టోబర్‌లో ప్రారంభమయ్యే రబీ సీజన్ మొదటి పంటగా పప్పుశనగ సాగు చేసే రైతులకు 40 శాతం సబ్సిడీతో విత్తనాలు అందజేస్తున్నట్లు ఏఓ నిరంజన్ తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సబ్సిడీ పోనూ కిలో కు రూ. 48.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరాకు 25 కిలోల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాలకు ఐదు ప్యాకెట్లు సరఫరా చేస్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

1,800క్వింటాళ్ల శనగవిత్తనాలు మంజూరు

కొలిమిగుండ్ల: రబీ సీజన్‌కు సంబంధించి మండలానికి 1,800 క్వింటాళ్ల శనగ విత్తనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని ఏఓ జ్యోతి బుధవారం తెలిపారు. క్వింటాం శనగ విత్తనాల పూర్తి ధర రూ.8,100 ఉండగా ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ రూ.3, 240 పోను రైతులు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గురువారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ తీసుకొని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

1,800 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు

అవుకు: అవుకు మండలానికి ప్రభుత్వం 1,800 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించిందని మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ హక్ తెలిపారు. క్వింటాం శనగ విత్తనాల ధర రూ.8,100 ఉండగా 40శాతం పోనూ రైతులు రూ.4,800 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో రైతుకు 5 ఎకరాల వరకు విత్తనాల పంపిణీ చేస్తామన్నారు. పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేలా చూడాలి



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న ఎంఈఓ రాజయ్య

కొలిమిగుండ్ల: విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి విద్యతోపాటు క్రీడల్లో రాణించేలా చూడాలని ఎంఈఓ రాజయ్య సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్పోర్ట్స్ కిట్లను స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం వివిద పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంఈఓ పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని మొత్తం 59 ఉండగా ఉన్నత పాఠశాలలకు రూ.32వేలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు రూ.22 వేలు విలువైన క్రీడా సామాగ్రిని ప్రభుత్వం అందజేశారన్నారు.

ఉచిత డ్రోన్ సర్వీస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లెరూరల్ : మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డ్రోన్ సర్వీస్ టెక్నిషియన్ కోర్సులో మూడు నెలల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేవీకే ప్రధాన అధికారి ధనలక్ష్మీ బుధవారం తెలిపారు. ఇంటర్ ఆపై చదివిన నిరుద్యోగ యువత, 18-30 ఏళ్ల వయసులోపు ఉన్న విద్యార్థులు అర్హులన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం



పొలాల రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ కృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలపరిధిలోని తవిసి కొండ గ్రామంలో రూ. 7లక్షలతో చేపట్టిన పొలాల రహదారి నిర్మాణానికి గ్రామ నాయకులు చింతల నాగిరెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి ఆధ్వర్యంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిరుపం రెడ్డి, గొల్ల రాముడు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న సెబ్ అధికారుల వాహనం

ప్యాపిలి: మండల పరిధిలోని రామకృష్ణాపురం మిట్ట వద్ద నంద్యాల సెబ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. అలేబాదుతండాకు చెందిన బాలునాయక్, బాలనాయక్ ద్విచక్రవాహంపై నాటు సారా తరలిస్తుండగా సెబ్ అధికారులు గమనించారు. నిందితులను పట్టుకునే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు సెబ్ అధికారుల వాహనం నిందితుల ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. నిందితులకు గాయాలు కావడంతో డోన్ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తప్పిన పెను ప్రమాదం

- చెరువులోకి దిగిన ప్రైవేట్ స్కూల్ బస్సు
- రోడ్డు కట్ట తడిగా ఉండడంతో నిలిచిపోయిన వాహనం
- విద్యార్థులతోపాటు డ్రైవర్ సురక్షితం



చెరువులోకి దిగిన కేబీఎన్ ప్రైవేట్ స్కూల్ బస్సు

అవుకు: మండల కేంద్రం అవుకు పట్టణ సమీపంలోని బోటింగ్ (రిజర్వాయర్) వద్ద కేబీఎన్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థుల బస్సు అదుపుతప్పి చెరువులోకి దిగిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. అయితే చెరువుకు సంబంధించిన రోడ్డు కట్ట తడిగా ఉండడంతో బస్సు అక్కడే నిలిచిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. విద్యార్థులతో పాటు డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. స్థానికుల వివరాలు మేరకు చెర్లోపల్లెకు చెందిన దాదాపు 20 మంది విద్యార్థులు మండల కేంద్రం అవుకులోని కేబీఎన్ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. రోజూ మాదిరిలానే పాఠశాల వదిలిన అనంతరం బస్సు డ్రైవర్ విద్యార్థులను ఎక్కించుకొని చెర్లోపల్లె గ్రామానికి బయల్దేరాడు. మార్గమధ్యలో రిజర్వాయర్ బోటింగ్ సమీపానికి రాగానే బ్రేక్ డ్రమ్‌ల్లో ఒకటి నిలిచిపోవడంతో స్టీరింగ్ కంట్రోల్ తప్పింది. ఒక్కసారిగా అదుపుతప్పి బస్సు చెరువులోకి దిగింది. మధ్యా హ్నాం వర్షం కురువడంతో చెరువుకు ఆనుకుని ఉన్న రోడ్డు కట్ట పూర్తిగా తడిసి ఉండడంతో బస్సు టైర్లు నేలలో దిగబడి కొద్దిగ నిటారుగా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ఎదురుగా ఏదైనా వాహనం వచ్చినా...బస్సు అలాగే చెరువులోకి దిగినా పెనుప్రమాదమే జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు కండిషన్‌లో లేకపోవటం, పాత బస్సులను రీ మోడలింగ్ చేసి తిప్పడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం మూలంగానే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ బస్సు కండిషన్ సరిగా లేదని ఆర్టీఓ అధికారులు హెచ్చరించినట్లు గ్రామస్తులు తెలిపారు.